సాక్షి
నంద్యాల
మంగళవారం । 26 । ఆగస్టు । 2025



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం వెండి రథోత్సవం నిర్వహించారు. ముందుగా సహస్ర దీపార్చన పూజలు చేశారు.



రజకుల నిరసన

సమస్యల పరిష్కారం కోసం కర్నూలు కలెక్టరేట్ ఎదుట దుస్తులు ఉతికి సోమవారం రజకులు నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,626.06
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 31,327
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 16,595

న్యూస్‌రీల్

మట్టి గణేష్‌లను పూజిద్దాం

- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మట్టి గణేష్ విగ్రహాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్

నంద్యాల: మట్టి గణేష్ విగ్రహాలను నెలకొల్పి పర్యావరణ పరిరక్షణకు చేయూతనివ్వాలని కలెక్టర్ రాజకుమారి ప్రజలకు పిలుపునిచ్చారు. ఈనెల 27న వినాయక చవితి పండుగను పురస్కరించుకొని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలు, అధికారులకు క్లాత్ బ్యాగుతో సహా 2,500 మట్టి వినాయక విగ్రహాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను పూజించి పర్యావరణ పరిరక్షణకు మన వంతు బాధ్యతగా చేయూత అందిద్దామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ జిల్లాలో బ్యాన్ చేయడం జరిగిందని, ఎవరైనా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను అమ్మిన వారిపై మొదటిసారి రూ.10వేలు, రెండవసారి రూ.20 వేలు, మూడోసారి పట్టుబడితే షాపులు సీజ్ చేయమని ఉత్తర్వులు జారీ చేశామన్నారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ నిషేధిస్తూ ఇచ్చిన నోటీసులను మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారులు ప్రతి షాపు వారికి తెలియజేసి షాపు ముందు ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రాము నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బంగారు హారాల సమర్పణ



ఈఓ శ్రీనివాసరావుకు బంగారు హారాలు అందజేస్తున్న దాత

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి సోమవారం నెల్లూరుకు చెందిన అచ్యుత వేంకట సాయి మాధవ శశాంక్ కుటుంబ సభ్యులతో కలిసి మూడు బంగారు హారాలను విరాళంగా సమర్పించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు బంగారు హారాలను కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావుకు అందజేశారు. పగడాలు, ముత్యాలు, కెంపులు, పచ్చలు కూడిన ఈ మూడు బంగారు హారాల మొత్తం బరువు 232 గ్రాములు ఉంటుందని దాతలు తెలిపారు. అనంతరం దాతకు రశీదును అందజేసి వేదాశీర్వచనంతో పాటు స్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి జి. స్వాములు, అమ్మవారి ఆలయం ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

కర్నూలు సిటీ: డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 28 తేదీ నుంచి పరిశీలన చేయనున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. అయితే ఆ రోజు కూడా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇందుకు కారణం నార్మలైజేషన్‌లో జరిగిన తప్పులే కారణమని తెలుస్తోంది. ఆ తప్పులను సరిదిద్దలేక విద్యాశాఖ సాంకేతిక బృందాలు ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం. ఉపాధ్యాయ ఉద్యోగం వస్తుందనే ఆశతో ఇప్పటికే అభ్యర్థులందరూ సర్టిఫికెట్లలన్నింటినీ సిద్ధం చేసుకున్నారు. బోనఫైడ్ సర్టిఫికెట్ కావాలంటుడడంతో అది ఎక్కడిస్తారు.. ఎవరిస్తారు.. అనే విషయం తెలియక చాలా మంది ఆందోళనకు గురవుతున్నారు.

చట్టపరిధిలో న్యాయం చేస్తాం

- జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ

నంద్యాల: ప్రజా సమస్యల పరిష్కార వేదిక వచ్చిన ఫిర్యాదులకు చట్ట పరిధిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్పీ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్‌లో 88 సమస్యలు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామన్నారు.

భగ్గుమన్న బాధితులు

- కలెక్టరేట్‌ను ముట్టడించిన దివ్యాంగులు
- వైఎస్సార్‌సీపీ, ఎమ్మార్పీఎస్, సీపీఎం ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన
- కలెక్టరేట్‌కు అడ్డుగా ఉన్నారని దివ్యాంగులను లాగి పడేసిన పోలీసులు
- మరో వైపు వేతనాలు పెంచాలని పంచాయతీ కార్మికులు..
- ఇంకో వైపు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని విద్యార్థుల ఆందోళన
- నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దివ్యాంగులు



నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులను అడ్డుకుంటున్న పోలీసులు



తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని నినాదాలు చేస్తున్న దివ్యాంగులు

నంద్యాల: కూటమి ప్రభుత్వ తీరుపై ఆయా వర్గాల బాధితులు భగ్గుమన్నారు. న్యాయం చేయాలని ఆందోళన బాటపట్టారు. నిరసనలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. పాలకుల తీరును ఎండగట్టారు. తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన ధర్నాకు దివ్యాంగులు భారీ ఎత్తున తరలి వచ్చారు. వైఎస్సార్‌సీపీతో పాటు దివ్యాంగుల జేఏసీ, వికలాంగుల ఆదరణ సేవా సమితి పోరాటం, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎమ్మార్పీఎస్ వంటి పలు సంఘాల ఆధ్వర్యంలో దివ్యాంగులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి భారీగా వికలాంగులు తరలి రావడం, పింఛన్లను వెంటనే పునరుద్ధరించేంత వరకు ఆందోళన విరమించమని కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళన ఒకింత ఉద్రిక్త వాతావరణానికి దారి తీసింది. పోలీసులు సమస్యలు పరిష్కారం కావాలంటే కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయాలని, ఇలా రోడ్లపై కూర్చొంటే వచ్చిపోయే వారికి ఇబ్బంది అవుతుందని, వెంటనే ధర్నా విరమించాలని సీఐ కంబగిరిరాముడు సూచించారు. అయితే దివ్యాంగులు ఆందోళన విరమించకుండా అలాగే కూర్చోవడంతో సీఐ తమ పోలీసు సిబ్బందితో దివ్యాంగులను లాగి పక్కకు పడేశారు. ధర్నా భగ్నం చేయవద్దని దివ్యాంగులు సీఐ కాళ్లపై పడి వేడుకున్నా వారు కనికరించకుండా ధర్నాను విఫలం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులతో పాటు పలు సంఘాల నాయకులు పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఉన్న జిల్లా కలెక్టర్ రాజకుమారికి దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలని వినతి పత్రం అందజేశారు. ముందుగా ధర్నానుద్దేశించి వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవనగర్‌బాషా, జిల్లా వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ అసోసియేషన్ అధ్యక్షుడు కారురవికుమార్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు సాయిరాంరెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చే పింఛన్‌పైనే ఆధారపడి దివ్యాంగులు జీవిస్తున్నారని, వారి పింఛన్లను తొలగించడం అన్యాయమన్నారు. దివ్యాంగులు ఇప్పటికే సమాజంలో అనేక సవాళ్లను, అవమానాలను ఎదుర్కొంటూ జీవనం సాగిస్తున్నారని, వారిని మరింత దిగజార్చవద్దన్నారు. పింఛన్లు పునరుద్ధరించేంత వరకు దివ్యాంగులకు అండగా ఉంటామన్నారు.

పలు సంఘాల ఆధ్వర్యంలో..

అర్హులైన దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని, దివ్యాంగుల సదరన్ సర్టిఫికెట్లలో వెరిఫికేషన్ పేరుతో వికలత్వ శాతాన్ని తగ్గించారని, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ, వికలాంగుల సంఘం, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండువీరయ్య మాదిగ, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు మస్తాన్‌వలి, వికలాంగుల ఆదరణ సేవా సమితి అధ్యక్షుడు మరియదాసు మాట్లాడుతూ.. 2010లో సదరన్ క్యాంపులో ముగ్గురు డాక్టర్లు, ఫిజియోథెరపీ డాక్టర్ ఒక్కో వికలాంగుడికి పది నిమిషాలు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లను ఇచ్చారని, ఇప్పుడు ఇష్టమొచ్చినట్లు వైకల్యశాతాన్ని తగ్గించి సర్టిఫికెట్లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రభుత్వం వెంటనే దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించి వారికి న్యాయం చేయాలన్నారు.

బిడ్డను ఎట్లా పోషించేది..



చిత్రంలో కుమారుడు ఇర్ఫాన్‌తో ఉన్న మహిళ పేరు కరీమూన్. సొంతూరు రుద్రవరం. బెంచీపై ఉన్న తన 15 ఏళ్ల కుమారుడికి పుట్టుక నుంచి కాళ్లు, చేతులు చచ్చుబడిపోయాయి. నడవలేడు, కూర్చోలేడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.15వేలు పింఛన్ వచ్చేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పింఛన్ దారుల వెరిఫికేషన్ అంటూ వికలత్వం శాతం తగ్గించి రూ.15 వేలు వస్తున్న పింఛన్ రూ.6వేలకు తగ్గించారు. 'ఇన్ని రోజులు పింఛన్ వస్తుండటంతో కుమారుడిని చూసెట్టుకుంటూ ఇంటి వద్దనే ఉంటూ సేవలు చేస్తుంటిని ఇప్పుడు పరిస్థితి అర్థం కావడం లేదు. న్యాయం కోసం కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చానని కరీమూన్ కన్నీటి పర్యంతమైంది.

వినతులు వెంటనే పరిష్కరిస్తాం



పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పీజీఆర్ఎస్‌లో 334 సమస్యలు వచ్చాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఎండార్స్ చేశాం. సమస్యలు పదేపదే పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వినతుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.
–రాజకుమారి, జిల్లా కలెక్టర్, నంద్యాల

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం..

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు విడుదల చేయాలని, జీవో నం.77ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు చెల్లించాలన్నారు.



ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్ అమలు చేయాలి..

గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్ అమలు చేసి స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పండుగ సెలవులు మంజూరు చేయాలని, టెండర్ విధానం రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఆందోళన చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

భయపడొద్దు.. అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: టీడీపీ వర్గీయులు అకారణంగా దాడులకు పాల్పడుతున్నారని, ఎవరూ భయపడొద్దని, తాము అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి ధైర్యం చెప్పారు. ఓర్వకల్లు మండలంలోని హుసేనాపురం గ్రామంలో ఆదివారం రాత్రి 10.30 గంటల సమయంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పాల మధుమోహన్‌రెడ్డి ఇంటిపై టీడీపీ వర్గీయులు ముకుమ్మడిగా రాళ్లతో దాడి చేశారు. ఇల్లు పాక్షికంగా దెబ్బతినింది. విషయం తెలిసి బాధితుని ఇంటికి సోమవారం కాటసాని వెళ్లారు. దాడి జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. మధుమోహన్‌రెడ్డి కుటుంబ సభ్యులను ధైర్యం చెప్పారు. అనంతరం కాటసాని విలేకరులతో మాట్లాడుతూ.. టీడీపీ వర్గీయులు అకారణంగా దాడులకు బరితెగించడం సమంజసం కాదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పోలీసులు తమ హోదా, బాధ్యతలను విస్మరించారని ఆరోపించారు. చట్టాలను టీడీపీ నాయకులకు చుట్టాలుగా మారుస్తున్నారని విమర్శించారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, పోలీసుల బలాన్ని అడ్డు పెట్టుకొని దుశ్చర్యలకు పాల్పడుతుంటే సహించేది లేదన్నారు. హుసేనాపురం ఘటనలో ఎస్ఐ సునీల్ కుమార్ తమ పోలీసు సిబ్బందితో వెంటనే స్పందించడంపై హర్షం వ్యక్తం చేశారు. కాటసాని వెంట మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు, సింగిల్ విండో మాజీ చైర్మన్ నాగతిరుపాలు, పార్టీ నాయకులు మధుమోహన్‌రెడ్డి, గోపా వెంకటరమణారెడ్డి, గోపా రామ్మోహన్‌రెడ్డి, రామేశ్వరరెడ్డి, గుండాల చెన్నారెడ్డి ఉన్నారు.

తగ్గిన వరద ఉధృతి

శ్రీశైలం ప్రాజెక్టు: శ్రీశైలం రిజర్వాయర్‌కు వరద ఉధృతి తగ్గడంతో గేట్ల సంఖ్య, ఎత్తు తగ్గించి నీటి విడుదల కొనసాగిస్తున్నారు. ఆదివారం వరకు 10 రేడియేల్ క్రస్ట్ గేట్లను 18 అడుగుల మేరకు తెరచి నాగార్జునసాగర్‌కు నీటి విడుదలను చేశారు. వరద ప్రవాహం తగ్గడంతో సోమవారం సాయంత్రానికి ఒక గేటును మూసివేసి 9 రేడియల్ క్రస్ట్ గేట్లు ద్వారా 2, 67,527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం నుంచి సోమవారం వరకు జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి 4,87,487 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరింది. ప్రాజెక్టు నుంచి దిగువ ప్రాంతాలకు 4, 76,873 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. స్పిల్‌వే ద్వారా 3,77,649 క్యూసెక్కులు, రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పాదన అనంతరం 65,600 క్యూసెక్కులు నాగార్జున్ సాగర్ కు విడుదల చేశారు.

పసురపాడు వీహెచ్ఏ సస్పెన్షన్

గోస్పాడు: పసురపాడు గ్రామ రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ శ్రీకాంత్ రెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ అమానుల్లా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మంజూరు చేసిన యూరియాను గ్రామ రైతు సేవా కేంద్రం పరిధిలో పంపిణీ చేయకుండా పక్కదారి మళ్లించి నంద్యాల సమీపంలోని బయట ప్రాంతంలో యూరియాను పంపిణీ చేశారని గ్రామస్తుల ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టి నివేదికను ఉన్నతాధికారులకు అందజేసినట్లు తెలిపారు. ఈ మేరకు విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వీహెచ్ఏ శ్రీకాంత్ రెడ్డిపై చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేసినట్లు జిల్లా హార్టికల్చర్ అధికారి నాగరాజు ఉత్తర్వులు జారీ చేశారన్నారు.

యూరియా పంపిణీలో ఉద్రిక్తత

- గువ్వలకుంట్లలో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ
- ఆత్మకూరు రూరల్ సీఐ, కొత్తపల్లి జెడ్పీటీసీ మధ్య వాగ్వాదం
- పెద్ద గుమ్మడాపురంలో పంపిణీ నిలిపివేత



వాగ్వాద పడుతున్న ఆత్మకూరు సీఐ, కొత్తపల్లి జెడ్పీటీసీ సభ్యుడు



గువ్వలకుంట్లలో పోలీసు సమక్షంలో యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: వ్యవసాయాధికారుల నిర్లక్ష్యంతో పలు చోట్ల యూరియా పంపిణీలో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. చివరకు పోలీసు బందోబస్తు మధ్య పంపిణీ చేయాల్సి వచ్చింది. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి, కొక్కెరంచ, పెద్ద గుమ్మడాపురం గ్రామ ఆర్ఎస్‌కేలకు ఒక్కో లారీ యూరియా లోడు చొప్పున చేరుకున్నాయి. గువ్వలకుంట్ల, కొక్కెరంచ గ్రామాల్లో పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ చేయగా, పెద్ద గుమ్మడాపురం గ్రామంలో ఘర్షణ తలెత్తగా పంపిణీ నిలిపివేశారు. గువ్వలకుంట్ల గ్రామ రైతుల పొలాలు అన్ని ఆత్మకూరు మండలం కురుకుంద పొలిమేరలో ఉన్నాయి. అయితే ఏళ్ల తరబడి రైతులు గువ్వలకుంట్ల గ్రామంలో ఎరువులు పొందుతున్నారు. వ్యవసాయ అధికారులు అవగాహన లోపంతో పొలిమేరలో పంచాయితీ పెట్టి రైతులకు మధ్య ఘర్షణలు రేకెత్తించారు. అందులో భాగంగా బండినాయుని పాలెం, గువ్వలకుంట్ల రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయ సిబ్బందిని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి నిలదీశారు. ఈక్రమంలో ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసు సిబ్బంది, రైతులు నచ్చజెప్పి వారిని శాంతింపజేశారు. అంతకు ముందు గువ్వలకుంట్ల సచివాలయానికి వస్తున్న యూరియా లారీని వీరాపురం గ్రామ రైతులు కొంత మంది అడ్డుకున్నారు. దీంతో పోలీసులు లారీని కొత్తపల్లి పోలీసు స్టేషన్ తరలించి అనంతరం సీఐతో పాటు గువ్వలకుంట్ల సచివాలయానికి తీసుకువచ్చారు. అక్కడ పొలం పాసుపుస్తకానికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు.

బ్లాక్‌లో తరలిస్తున్న ఎరువులు స్వాధీనం

నందికొట్కూరు: ఎలాంటి అనుమతులు లేకుండా తెలంగాణ రాష్ట్రం అలంపూర్‌కు బ్లాక్‌లో తరలిస్తున్న ఎరువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నందికొట్కూరు పట్టణంలోని శ్రీలక్ష్మీనరసింహ ఎరువుల దుకాణం నుంచి బొలెరో వాహనంలో డీఏపీ 58 బస్తాలు, ట్రాక్టర్‌లో 28.28.0 ఎరువులను తెలంగాణలోని అలంపూర్‌కు తరలిస్తునట్లు సమాచారం వచ్చిందని రూరల్ సీఐ సుబ్రమణ్యం, బ్రాహ్మణకొట్కూరు ఎస్ఐ తిరుపాలు తెలిపారు. సోమవారం బ్రాహ్మణకొట్కూరులో వాహనాలను తనిఖీ చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాక్‌లో తరలిస్తున్నట్లు గుర్తించారు. వాహనాలను తనిఖీ చేసి ఎరువులను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న లింగనవాయికి చెందిన చాకలి పరశురాముడు, శ్రీలక్ష్మీనరసింహ ఎరువుల దుకాణదారుడు నందకుమార్, కొత్తపల్లి మండలం ఎర్రమఠం గ్రామానికి వేణుగోపాల్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న దృశ్యం

కర్నూలు: సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల నియామక ప్రక్రియలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయ పెరేడ్ మైదానంలో సోమవారం ధృవీకరణ పత్రాల పరిశీలన చేపట్టారు. మొత్తం 309 మంది సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థుల్లో 297 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరయ్యారు. అభ్యర్థులు సమర్పించిన ధృవీకరణ పత్రాలన్నిటినీ సమగ్రంగా కౌంటర్ల వారీగా పరిశీలించారు. అన్ని పత్రాలను సక్రమంగా సమర్పించిన వారిని తదుపరి నియామక దశకు ఎంపిక చేస్తారని తెలిపారు.

నేడు ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పత్రాల పరిశీలన

334 మంది ఏపీఎస్పీ కానిస్టేబుల్ అభ్యర్థులకు మంగళవారం పత్రాల పరిశీలన ఉంటుంది. మొదటి రోజు హాజరు కాని సివిల్ కానిస్టేబుళ్లు 12 మందికి ఏపీఎస్పీ అభ్యర్థులతో పాటు మరోసారి అవకాశం కల్పిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. అడిషనల్ ఎస్పీలు హుసేన్ పీరా, కృష్ణమోహన్, డీఎస్పీ భాస్కర్ రావు, డీపీఓ ఏఓ విజయలక్ష్మి, ఆర్ఐలు, సూపరింటెండెంట్లు, డీపీఓ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు హాస్టల్ ప్రవేశాలు

కర్నూలు(అర్బన్): నగరంలోని వేంకటాచలపతి నగర్‌లోని మైనారిటీ (బాలురు) విద్యార్థుల పోస్టు మెట్రిక్ ప్రభుత్వ వసతి గృహంలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి 25 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. జిల్లాలోని దూర ప్రాంతాల నుంచి వచ్చి నగరంలోని వివిధ కళాశాలల్లో చదువుతున్న మైనారిటీ విద్యార్థులు ప్రవేశం పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు 9440822219, 9848864449ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

నాపరాయి వ్యాపారి ఐపీ

బేతంచెర్ల: పట్టణానికి చెందిన కందగడ్డల రాం ప్రసాద్ అనే (పాలిస్) నాపరాయి వ్యాపారి రూ. 86.80 లక్షలకు ఐపీ పెట్టాడు. ఈ మేరకు పట్టణానికి చెందిన 25 మంది నాపరాయి వ్యాపారస్తులకు సోమవారం ఐపీ నోటీసులు అందాయి. రాం ప్రసాద్‌తో వివిధ రకాలుగా వ్యాపారాలు చేస్తున్న వారికి, పరిశ్రమల యజమానులుకు ఐపీ నోటీసులు రావడంతో లబో దిబోమంటున్నారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

ప్యాపిలి: పట్టణానికి చెందిన రాజశేఖర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. కర్నూలులో ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న 1982–83 బ్యాచ్‌కు చెందిన తోటి విద్యార్థులు కొంత ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఈ మేరకు వారు పోగు చేసిన మొత్తం రూ. 30 వేలను సోమవారం బాధితుడికి అందజేసినట్లు తోటి మిత్రుడు చంద్రమోహన్ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో సర్టిఫికెట్లు దగ్ధం



కాలిపోయిన సర్టిఫికెట్లను చూపుతున్న మధు

అవుకు(కొలిమిగుండ్ల): చెర్లోపల్లెలో సోమవారం ఓ ఇంట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో డీఎస్సీ అభ్యర్థికి చెందిన సర్టిఫికెట్లు, పుస్తకాలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ముక్కమల్ల మధు అనే యువకుడు ఇటీవల విడుదల అయిన డీఎస్సీ ఫలితాల్లో ఎస్జీటీకి సంబంధించి 80.53 మార్కులు సాధించాడు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అన్నీ సిద్ధం చేసుకున్నాడు. కాగా సోమవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో కుటుంబ సభ్యులు బయట పనిలో నిమగ్నమై ఉండగా షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. స్థానికులు సాయంతో మంటలను అదుపు చేశారు. కాగా అప్పటికే ఇంట్లో సామగ్రితో పాటు వెరిఫికేషన్‌కు సిద్ధం చేసుకున్న సర్టిఫికెట్లు అన్నీ బుగ్గిఅయ్యాయి. ఈ ఘటనపై అవుకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వెరిఫికేషన్‌కు తప్పక ఒరిజనల్ సర్టిఫికెట్లు అవసరం. విజయవాడకు వెళ్లి దరఖాస్తు చేసుకున్నా సర్టిఫికెట్లు రావాలంటే కనీసం పదిహేను రోజుల సమయం పడుతుందని బాధితుడు మధు ఆవేదన వ్యక్తం చేశాడు.

గాయపడిన ముగ్గురు యువకులు మృతి


మాబు


రాజేష్


రాఘవేంద్ర

మంత్రాలయం: రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకోలేక ముగ్గురు యువకులు మృతి చెందారు. ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎమ్మిగనూరు మండలం బనవాసిఫారం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి కారును మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టడంతో మంత్రాలయానికి చెందిన రాజేష్, మాబు తీవ్ర గాయాలయ్యాయి. కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరూ మృతిచెందారు. మృతులు ఇద్దరూ స్నేహితుల కావడం పలువురిని కంటతడి పెట్టించింది. రాజేష్ మంత్రాలయంలో కస్టమర్ సర్వీసు సెంటర్ పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. పెళ్లిళ్లు కావాల్సిన తరుణంలో ఇద్దరు మృతి చెందడం కలచివేసింది.

చికిత్స పొందుతూ..

మండల కేంద్రంలోని రాఘవేంద్ర పురానికి చెందిన సోడాల సూరి, రేఖమ్మ పెద్దకుమారుడు రాఘవేంద్ర (21) అమావాస్య రోజున శనివారం ఉరకుంద ఈరన్నస్వామి దర్శనార్థం బైకుపై బయలుదేరాడు. మండలంలోని రచ్చమర్రి గ్రామ సమీపంలో బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. చికిత్స తీసుకుంటూ సోమవారం మృతి చెందాడు. రాఘవేంద్ర స్థానికంగా ఉన్న బొమ్మల దుకాణంలో కూలిగా పనిచేస్తున్నాడు.

జైజై గణేశా!



వాహనంలో గణేశుని ప్రతిమను తీసుకెళ్తూ..



పూజకు సిద్ధంగా ఉన్న గణేశుని మండపం

'జైజై గణేశా.. జయములివ్వు గణేశా' అంటూ వినాయక చవితి ఉత్సవాలకు ప్రజలు సిద్ధమయ్యారు. లంబోదరుడిని కూర్చోబెట్టేందుకు మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఏకదంతుడికి అర్చన చేసేందుకు పూజాసామగ్రి కొనుగోలు చేశారు. కర్నూలులో బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు వేడుకలు సాగనున్నాయి. విఘ్నాలు లేకుండా పండుగ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. అతి చిన్న ప్రతిమల నుంచి భారీ స్థాయి గణనాథుల రూపాలు కొలువుదీరనున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



పూజకు వెళ్తున్న భారీ లంబోదరుడు



మండపాన్ని తీర్చిదిద్దుతూ..



మినీలారీలో తీసుకెళ్తూ..



కొలువు దీరుతున్న వినాయక విగ్రహం వద్ద పిల్లల సందడి

గార్ధభాలతో రజకుల నిరసన

- కలెక్టరేట్ ఎదుట దుస్తులు ఉతికి ఆందోళన



గార్ధభాలతో నిరసన తెలుపుతున్న రజకులు

కర్నూలు(సెంట్రల్): సమస్యల పరిష్కారం కోసం రజకుల కలెక్టరేట్ ఎదుట వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సోమవారం ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో గార్ధభాలతో నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యలను పట్టించుకోవడంలేదని అక్కడే దుస్తులు ఉతికి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్, కర్నూలు నగర కార్యదర్శి సి.శేషాద్రి, మహిళా నాయకురాలు ఎస్. రత్తమ్మ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రజకులపై దాడులు ఆగడం లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు అట్రాసిటీ తరహాలో చట్టాన్ని తేస్తామని చెప్పిన సీఎం చంద్రబాబు పట్టించుకోవడంలేదన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రజకులు కులవివక్షకు గురవుతున్నారని, అగ్రవర్ణాల పెత్తందారుల నుంచి రక్షణ కల్పించాలన్నారు. రజకుల శ్రమ దోపిడీ నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రజక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.1000 కోట్లను కేటాయించాలని, 50 ఏళ్లు నిండిన రజకులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. జీఓ నంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ధోబీ పోస్టులను రజకులతోనే భర్తీ చేయాలన్నారు. విశ్వకర్మ కౌశల్య యోజన కింద ఎంపికైన లబ్ధిదారులకు తక్షణమే పనిముట్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సి.రాముడు, సుంకన్న, శేకట్‌బాబు పాల్గొన్నారు.

బెస్ట్ టీచర్ అవార్డుల ఎంపికకు ఇంటర్వ్యూలట!

- దరఖాస్తు చేసుకోని వారికి సైతం అవార్డుల ఎంపికకు అవకాశం
- టీచర్ మెరిట్‌కు 600, ఇంటర్వ్యూకు 200 మార్కులుగా మార్పు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ దినోత్సవం రోజున ప్రతి ఏటా స్కూల్, కాలేజీ విభాగంలో ఉత్తమ బోధన, వినూత్నమైన బోధన చేసే వారికి ఉత్తమ టీచర్ అవార్డులు ఇస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డులకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 21వ తేది వరకు గడువు విధించారు. దరఖాస్తులు ప్రిన్సిపాళ్ల నుంచి కాలేజీ ఆర్జేటీలకు ఈ నెల 23వ తేదీన చేరాయి. నేడు(మంగళవారం) ఆర్జేడీల నుంచి కాలేజీయేట్ కమిషనర్‌కు చేరనున్నాయి. కమిషనర్‌కు చేరిన వారికి ఈనెల 29న వ్యక్తిగత ముఖాముఖీ/ఇంటర్వ్యూ ఉంటుంది. 30వ తేదిన కమిషనర్ దగ్గర తుది సమావేశం నిర్వహించి అవార్డులకు ఎంపిక చేయనున్నారు. వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిభకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన ఉత్తమ అవార్డులకు ఎంపిక చేసేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈనెల 14న ఉత్తమ అవార్డుల ఎంపికలో కొన్ని మార్పులు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఉత్తర్వుల ప్రకారం టీచర్ ప్రొఫెషనల్ అడ్జెస్ట్‌మెంట్‌కు 800 మార్కులు, 200 మార్కులు ప్రత్యేకంగా ఇంటర్వ్యూకు కేటాయించారు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపికలో ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు పెట్టడం, దరఖాస్తు చేసుకోని వారిని కూడా అవార్డులకు ఎంపిక చేసే వెసులుబాటు కల్పించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా చేయడం వల్ల నిజాయితీ, చిత్తశుద్ధితో పని చేస్తున్న వారికి రాష్ట్ర స్థాయి ఉత్తమ టీచర్ అవార్డుల ఎంపికలో అన్యాయం జరిగే అవకాశం ఉన్నట్లు కాలేజీ అధ్యాపకుల్లో చర్చ జరుగుతోంది.

క్వార్టర్స్‌లో అనధికార వ్యక్తులను ఖాళీ చేయించాలి

కర్నూలు (సెంట్రల్): కర్నూలులోని ఏ, బీ, సీ క్యాంప్ క్వార్టర్స్‌లో అనధికారికంగా నివాసముంటున్న వారిని ఖాళీ చేయించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి సి.వెంకటనారాయణమ్మ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, పోలీస్, విద్యుత్, రెవెన్యూ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ.. క్వార్టర్స్‌లో అనధికర వ్యక్తులను ఖాళీ చేయించేందుకు నోటీసులు ఇచ్చామని, వారు ఖాళీ చేయని పక్షంలో సెప్టెంబర్ 8 నుంచి గృహాలకు విద్యుత్, నీటి సరఫరా తదితర సౌకర్యాలను బంద్ చేసి ఖాళీ చేయించేలా సమావేశంలో నిర్ణయించారు.

సంక్షేమాధికారులకు షోకాజ్ నోటీసులు

కర్నూలు(అర్బన్): ఓర్వకల్ సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహంలో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి చర్యలు తీసుకున్నట్లు ఆ శాఖ సాధికారత అధికారిణి బి.రాధిక చెప్పారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ హాస్టల్‌లోని ఆరుగురు విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ కావడం, హాస్టల్ నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వసతి గృహ సంక్షేమాధికారికి చార్జెస్ ఫ్రేమ్ చేయడం జరిగిందన్నారు. అలాగే పర్యవేక్షణ లోపం కారణంగా సహాయ సంక్షేమాధికారి, కమాటీకి షోకాజ్ నోటీసులు జారీ చేశామని, అవుట్ సోర్సింగ్ పద్ధతిన కుక్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. ఈ నేపథ్యం లోనే కోడుమూరు, ఎమ్మిగనూరు, పర్ల ప్రాంతాల్లోని ఐదు వసతి గృహాలను తనిఖీ చేయడం జరిగిందన్నారు. వసతి గృహాల నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, ఆయా హాస్టళ్లలో ఎలాంటి ఘటనలు చోటు చేసుకున్నా ప్రభుత్వ నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో వసతి గృహ సంక్షేమాధికారులు, సహాయ సంక్షేమాధికారులు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు.

బార్ దరఖాస్తులకు కొరవడిన స్పందన

- నేటితో ముగియనున్న గడువు

కర్నూలు: మూడేళ్ల కాల పరిమితితో ప్రభుత్వం జారీ చేసిన నూతన మద్యం బార్ పాలసీకి ఆశావహుల నుంచి స్పందన కొరవడింది. గతంతో పోలిస్తే నూతన నోటిఫికేషన్‌లో పేర్కొన్న విధానంతో లాభాలు ఆర్జించడం కష్టమనే ధోరణితో వ్యాపారులు, ఆశావహులు దరఖాస్తు చేసుకోవడానికి ముందుకు రావడం లేదు. ఉమ్మడి జిల్లాలో 47 మద్యం బార్లకు లైసెన్స్‌ల కేటాయింపు కోసం ఈనెల 18న నోటిఫికేషన్ జారీ అయిన సంగతి తెలిసిందే. దరఖాస్తులు దాఖలు చేసేందుకు 26వ తేదీ చివరి రోజు. నోటిఫికేషన్ వెలువడి వారం రోజులు గడిచినప్పటికీ ఉమ్మడి జిల్లాలో ఆదోనిలోని రెండు బార్లకు కేవలం 8 దరఖాస్తులు మాత్రమే దాఖలయ్యాయి. కనీసం 4 దరఖాస్తులు దాఖలయ్యే బార్లకే లాటరీ విధానంలో లైసెన్స్ కేటాయిస్తామని ఎక్సైజ్ శాఖ నోటిఫికేషన్‌లో పేర్కొంది. పాత వ్యాపారులు ఎవరూ ముందుకు రాకపోవడంతో హోటల్ యజమానులు, ధాబా నిర్వాహకులు రియల్ ఎస్టేట్ వ్యాపారులను దరఖాస్తు చేసుకోవలసిందిగా ఎక్సైజ్ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. విడతల వారీగా పాత వ్యాపారులతో ఎక్సైజ్ అధికారులు చర్చలు జరుపుతున్నప్పటికీ స్పందన కొరవడింది. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 2028 ఆగస్టు 31వ తేదీ వరకు నూతన పాలసీ అమలులో ఉంటుంది. కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 16 జనరల్ కేటగిరీ, 2 గీత కులాలకు, ఆదోని మున్సిపాల్టీలో 4 జనరల్ కేటగిరీ, 1 గీత కులాలకు కేటాయించారు. అలాగే ఎమ్మిగనూరు మున్సిపాలిటీలో 2, గూడూరు నగర పంచాయతీ పరిధిలో 1 బార్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే ఇప్పటివరకు ఆదోనిలో 2 బార్లకు 8 దరఖాస్తులు మినహా మిగిలిన వాటికి ఒక్క దరఖాస్తు కూడా దాఖలు కాలేదు.

గీత కులాలకు 29 వరకు దరఖాస్తుల స్వీకరణ...

గీత కులాలకు పది శాతం బార్లు రిజర్వేషన్ ప్రాతిపదికన కేటాయించాలనే నిబంధన మేరకు ఉమ్మడి జిల్లాలో ఐదు బార్లను రిజర్వ్ చేసినందున వాటి దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది. ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు గీత కులాలకు రిజర్వేషన్ చేసిన బార్లకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది. వాటికి కూడా ఇప్పటివరకు కర్నూలు కార్పొరేషన్ పరిధిలో 2, ఆదోని మున్సిపాల్టీ పరిధిలో 1, నంద్యాల, డోన్ మున్సిపాల్టీ పరిధిలో ఒక్కొక్కటి చొప్పున రిజర్వేషన్ ప్రాతిపదికన బార్లను కేటాయించనున్నారు. కానీ ఇప్పటి వరకు వాటికి కూడా దరఖాస్తులు రాలేదు. గీత కులాల వారు కొంతమంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకున్నట్లు (పేర్లు నమోదు) అధికారులు చెబుతున్నారు.

పొట్లపాడులో ప్రభుత్వ స్థలం కబ్జా



రైతు భరోసా కేంద్రం పక్కన చదును చేసిన స్థలం

దేవనకొండ: ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఒక ఉద్యోగి రాజకీయ నాయకుడిగా అవతారమెత్తి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశాడు. దేవనకొండ మండలంలో పొట్లపాడు గ్రామంలో సర్వేనంబర్ 99లో రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్, గ్రామ సచివాలయం ప్రభుత్వ భవనాలు నిర్మించేందుకు 2020 ఏప్రిల్‌నెలలో దేవనకొండ తహసీల్దార్ అనుమతించారు. ఈ స్థలంలో రైతుభరోసా కేంద్రంలో నిర్మించారు. కొన్ని అనివార్య కారణాలతో 12 సెంట్ల స్థలాన్ని ఖాళీగా ఉంచారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఒక ఉద్యోగి టీడీపీ నాయకుడిగా చెలామణి అవుతూ ఈ స్థలాన్ని చదును చేయించి సరిహద్దు రాళ్లు నాటి కబ్జా చేశాడు. గతంలో ఈ వ్యక్తి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామికి సంబంధించిన స్థలాన్ని కూడా కబ్జా చేయాలని ప్రయత్నిస్తే గ్రామస్తులు అడ్డుకున్నామరు. దీనిపై రెవెన్యూ సిబ్బందిని వివరణ కోరగా తమకు ఎలాంటి సమాచారం అందలేదని, కబ్జా చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

- ఎస్పీకి బాధితుల ఫిర్యాదు
- పీజీఆర్ఎస్‌కు 96 ఫిర్యాదులు

కర్నూలు: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నందికొట్కూరుకు చెందిన తస్లీమా, కర్నూలుకు చెందిన షాదిక్ కలసి ఆరుగురి నుంచి రూ.30 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలుకు చెందిన దివ్యాంగుడు మురళీమోహన్ ఫిర్యాదు చేశారు. అలాగే నీటిపారుదల శాఖలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని లక్ష్మణ్ బాబు, సూర్య మాధవరావు కలసి రూ.6.50 లక్షలు తీసుకుని మోసం చేశారని కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన ఓ మహిళ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫిర్యాదు చేశారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదికకు మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయి. చట్ట పరిధిలో విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా కూడా పీజీఆర్ఎస్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని...

- తనకు కళ్లు కనపడవని, కంటికి ఆపరేషన్ చేయిస్తానని తమ్ముని భార్య అరుణ నమ్మించి రిజిస్టర్ ఆఫీస్ దగ్గరికి తీసుకెళ్లి ఆస్తిని రాయించుకున్న తర్వాత ఇంటికి తీసుకెళ్లి బంగారం, డబ్బులు తీసుకుని మోసం చేశారని మద్దికెర గ్రామానికి చెందిన వెంకటేష్ ఫిర్యాదు చేశారు.



పీజీఆర్ఎస్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

- కుమారుడు చనిపోయాడని, కొంతమంది వ్యక్తులు తన 20 ఎకరాల ఆస్తిని ఆక్రమించుకోవాలని ఫోర్జరీ సంతకాలతో అగ్రిమెంట్ చేయించుకున్నట్లు నమ్మించి మోసాలకు పాల్పడుతున్నారని చిప్పగిరి మండలం బంటినహాలు గ్రామానికి చెందిన నారాయణమ్మ ఫిర్యాదు చేశారు.
- తనకు జీవనాధారంగా ఉన్న ఆస్తిని మొత్తం కుమారుడు, కోడలు కలసి రాయించుకోవాలని ఒత్తిడి చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎమ్మిగనూరుకు చెందిన ఈరమ్మ ఫిర్యాదు చేశారు.

ఆర్‌యూలో ఆనర్స్ కోర్సులు

- దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలలో నాలుగు సంవత్సరాల ఆనర్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి. విజయ్‌కుమార్ నాయుడు తెలిపారు. వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వి. వెంకట బసవరావు ఆదేశాల మేరకు 2025–26 విద్యా సంవత్సరం నుంచి వర్సిటీ కళాశాలలో బీకాం (కంప్యూటర్ అప్లికేషన్), బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (హార్టికల్చర్) కోర్సులను ప్రవేశ పెట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి కోర్సులో 50 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనం లభిస్తుందని తెలిపారు. విద్యార్థిని, విద్యార్థులకున హాస్టల్ వసతి ఉందని పేర్కొన్నారు. డిగ్రీ కోర్సులకు ఆన్‌లైన్ అడ్మిషన్ల పోర్టల్ https://oamdc. ucanapply. com ద్వారా ఈనెల 26వ తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోడానికి అవకాశం ఉందని తెలిపారు. సీట్ అలాట్‌మెంట్ ప్రక్రియ ఈనెల 31వ తేదీ లోగా పూర్తి అవుతుందని తెలిపారు.

మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు

వెల్దుర్తి: మద్యం తాగి బైక్ నడిపిన వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ డోన్ జెఎఫ్‌సీఎమ్ కోర్టు జడ్జి అనిల్ కుమార్ తీర్పు ఇచ్చారని ఎస్ఐ అశోక్ తెలిపారు. వెల్దుర్తి సరిహద్దులో ఈనెల 21న తనిఖీలు చేస్తుండగా మద్యం తాగి చిన్న గోపాల్ అనే వ్యక్తి మోటార్‌సైకిల్ నడుపుతూ కనిపించాడన్నారు. అతనిపై 185 మోటార్ వెహికల్ యాక్ట్ క్రింద డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా రూ.10వేల జరిమానా లేదా 7రోజుల జైలు శిక్ష విధించారన్నారు. ముద్దాయి జైలు శిక్ష అనుభవిస్తాననడంతో అతన్ని కోర్టు కానిస్టేబుళ్లు డోన్ సబ్‌జైలుకు తరలించారన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

మంత్రాలయం రూరల్: బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ లీలా వెంకట శేషాద్రి పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం బాల్య వివాహాలు, ఎస్సీ, ఎస్టీ కేసులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో చైర్మన్ మాట్లాడుతూ.. మంత్రాలయం నియోజకవర్గంలో ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బాల్య వివాహాలు చేస్తే తల్లిదండ్రులపై, ప్రోత్సాహకులపై కేసులు నమోదు చేస్తారన్నారు. అనంతరం బాల్య వివాహాలపై మాతా శిశు సంక్షేమ శాఖ నేతృత్వంలో చిన్నారులతో ప్రదర్శన చేపట్టారు. సోషల్ వెల్ఫేర్ డీడీ రాధిక, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో నూర్జహాన్ బేగం, ఎంఈవో మోయినుద్దీన్, ప్రభుత్వాసుపత్రి సైకాలజిస్టు గంగాధర్ నాయక్ పాల్గొన్నారు.

'అయ్యా.. పింఛన్ ఇప్పించండి'



ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి అర్జీ ఇస్తున్న హనుమంతు

కోడుమూరు రూరల్: 'రోడ్డు ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా పోయింది.. ఒకరి సాయం లేకుండా ఏ పనులు చేసుకోలేను.. పింఛన్ ఇప్పించండి' అంటూ కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని దివ్యాంగుడైన తలారి హనుమంతు దీనంగా వేడుకున్నాడు. కోడుమూరులో టీడీపీ నాయకులు సోమవారం సభ నిర్వహించారు. ఈ సమయంలో కోడుమూరుకు చెందిన దివ్యాంగుడు తలారి హనుమంతు తనకు పింఛన్ ఇప్పించాలంటూ ఎమ్మెల్యేకు తన దీనస్థితిని వివరించాడు. ఇప్పటి వరకు కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, తనపై దయ ఉంచి మంజూరు చేయాలని కోరాడు.

ఎస్సీలకు సబ్సిడీపై డీస్లడ్జింగ్ వాహనం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని షెడ్యూల్డు కులాలు / సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లాకు వాక్యూమ్ సక్షన్ డీస్లడ్జింగ్ వాహనాన్ని కేటాయించినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే తులసీదేవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వాహనం కోసం డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న ఎస్సీ/ సఫాయి కర్మచారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వాహనం విలువ రూ.31,67,326లు కాగా, ఇందులో సబ్సిడీ రూ.14,16,831లు ఉంటుందని, మిగిలిన రూ.17,50,494లను ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణంగా అందిస్తుందన్నారు. ఎంపికైన లబ్ధిదారులు ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణాన్ని 72 కంతులలో తిరిగి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులను అందించాలన్నారు.

చెక్కుచెదరని పాత స్ట్రెచర్



ఈ ఫొటోలో కనిపిస్తున్న పాత స్ట్రెచర్ ప్రస్తుతం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో ఉంది. 50 ఏళ్ల క్రితం ఇలాంటి స్ట్రెచర్లను ఆసుపత్రిలో వినియోగించేవారని సిబ్బంది చెబుతున్నారు. అప్పటి నుంచి ఇది రంగు వెలసిపోయి తుప్పు పట్టడం మినహా చెక్కుచెదరకుండా ఉంది. దీనికి ప్రత్యేకమైన షాక్ అబ్జర్వర్స్ కూడా ఉన్నాయి. ఎలాంటి గుంతలు ఉన్నా రోగికి ఎలాంటి ఇబ్బంది లేకుండా తరలించేందుకు అవకాశం ఉంది. దీనికి పటిష్టమైన రెండు ఇనుప చక్రాలు ఉన్నాయి. దానికి సపోర్ట్‌గా రెండు రాడ్లు ఉన్నాయి. దీంతో దీనిపై నుంచి రోగి కిందపడే అవకాశం లేదు. రోగిని ఎలాంటి ఇబ్బంది లేకుండా ఒక చోట నుంచి మరోచోటకు సులువుగా తరలించే అవకాశం ఉంది. ప్రస్తుతం దీనిని మెడికల్ కాలేజీలో ఇతర అవసరాలకు ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న స్ట్రెచర్లు ఆరు నెలలు కూడా పనిచేయడం లేదు. దీంతో త్వరగా అవి మూలకు చేరడమో లేక మరమ్మతులకు గురికావడమో జరుగుతోంది. అలా గాకుండా పూర్వం వాడిన స్ట్రెచర్ మోడల్‌లో నాణ్యమైనవి కొత్తవి తయారు చేస్తే రోగులకు ఉపయోగపడే అవకాశం ఉంది.

– కర్నూలు(హాస్పిటల్)